క్లుప్తంగా

చురుకుగా డ్రైనేజీ నిర్మాణ పనులు



డ్రైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ అరుణ తదితరులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో డ్రైనేజీల నిర్మాణాలు చురుకుగా జరుగుతున్నాయి. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ దృష్టికి ప్రజలు తీసుకువచ్చిన సమస్యల పరిష్కారంలో భాగంగా డ్రైనేజీల నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేశారు. బియ్యంపేట, ద్రాక్షారామ – ఆదివారపుపేట రహదారులను ఆనుకుని ఉన్న డ్రైన్ల నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. ఈ పనులను సర్పంచ్ కొత్తపల్లి అరుణ, వార్డు సభ్యురాలు పిల్లి సుహాసిని, పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్య సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాహుల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రసూన గురువారం పరిశీలించారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కృషి



ఏడిదలో ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్ ఆశీర్వాదం తదితరులు

మండపేట: కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అన్నారు. కుష్ఠు వ్యాధిపై ఇంటింటా సర్వేలో భాగంగా గురువారం ఆ గ్రామంలో ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను సర్పంచ్ ఆశీర్వాదం వివరించారు. వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, ఈఓ వుండమట్ల వీర్రాజు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో తపాలా పథకాలు



స్టాంపులపై అవగాహన కల్పిస్తున్న జానకీ రామారావు

రామచంద్రపురం: మారుతున్న కాలానికి అనుగుణంగా తపాలా శాఖ వివిధ పథకాలు తీసుకు వచ్చిందని స్థానిక పోస్ట్‌మాస్టర్ జానకీ రామారావు అన్నారు. ప్రపంచ మేళా డే సందర్భంగా తపాలా శాఖ ఆధ్వర్యాన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివిధ పోస్టల్ పథకాలతో పాటు మై స్టాంప్ కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డ నుంచి వృద్ధాప్యంలో ఉన్న వారి వరకూ తపాలా శాఖ వివిధ పొదుపు, జీవిత బీమా పథకాలు అందిస్తోందని చెప్పారు. మై స్టాంప్ కార్యక్రమంలో భాగంగా అరుదుగా దొరికే స్టాంపులు విక్రయిస్తామని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రధాన తపాలా కార్యాలయంలో ఫిలాటికల్ స్టాంపులు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తపాలా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ బోధనకు ప్రాధాన్యమివ్వాలి



రాయవరంలో ఐఎఫ్‌పీ డిస్‌ప్లే పనితీరును పరిశీలిస్తున్న శాలెంరాజు, ఏసీ రమణశ్రీ

రాయవరం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ద్వారా డిజిటల్ బోధనకు ప్రాధాన్యమివ్వాలని రామచంద్రపురం ఉప విద్యాశాఖాధికారి పి.శాలెంరాజు, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బొజ్జా రమణశ్రీ పిలుపునిచ్చారు. రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలను వారు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటికే పాఠశాలలకు పంపిణీ చేసిన ఐఎఫ్‌పీల పనితీరును పరిశీలించిన అనంతరం వారు ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఐఎఫ్‌పీల సాయంతో విద్యార్థులకు బోధనను సమర్థవంతంగా, సులభంగా అర్థమయ్యేలా చేయవచ్చన్నారు. భవిష్యత్ అంతా డిజిటల్ బోధనపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఇప్పటికే డిజిటల్ టెక్నాలజీపై ఉపాధ్యాయులు తీసుకున్న శిక్షణను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థుల విద్యాస్థాయిని, మధ్యాహ్న భోజన పథకాన్ని వారు పరిశీలించారు. హెచ్ఎం వీఎస్ సునీత తదితరులు ఉన్నారు.

పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై ఆగ్రహం

- గొల్లపాలెం వైఎస్సార్ జంక్షన్‌లో మానవహారం
- కాకినాడ – కోటిపల్లి రహదారిపై ర్యాలీ
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



గొల్లపాలెంలో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మతో ధర్నా చేస్తున్న వలంటీర్లు

కాజులూరు: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలపై గ్రామ/వార్డు వలంటీర్ల ఆందోళనలు కొనసాగుతున్నాయి. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వలంటీర్లు గొల్లపాలెం వైఎస్సార్ జంక్షన్‌లో గురువారం భారీ మానవహారం నిర్వహించి, పవన్ కల్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించి, దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వలంటీర్లు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. వలంటీర్ల ఆందోళనతో కాకినాడ – కోటిపల్లి రహదారిపై ఇరు వైపులా కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. గొల్లపాలెం ఎస్సై తులసీరామ్ వలంటీర్లను సముదాయించి ట్రాఫిక్‌ను చక్కదిద్దారు. అనంతరం వలంటీర్లు కాకినాడ – కోటిపల్లి రహదారి మీదుగా పోలీస్ స్టేషన్‌కు ర్యాలీ గా తరలివెళ్లి, పవన్ కల్యాణ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. గ్రామాల్లో నిరక్షరాస్యులకు, వృద్ధులకు, వికలాంగులకు ఎంతో మేలు జరుగుతోందని, సేవాభావంతో పని చేస్తున్న వలంటీర్లను రాజకీయ దురుద్దేశంతో విమర్శించటం సరికాదని అన్నారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు సరికాదని, పవన్ కల్యాణ్ తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పాలన

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- టేకిలో గడప గడపకూ..



టేకిలో ప్రజలకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: కుల, మత, ప్రాంతీయ, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు సంక్షేమ పాలనను అందిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. గురువారం కాలేరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులు మాట్లాడుతూ ప్రతినెలా ఒకటో తేదీన వలంటీర్లు వచ్చి పింఛను డబ్బులిస్తున్నారయ్యా అంటూ సంతోషాన్ని పంచుకున్నారు. మండలంలోని గ్రామాల అభివృద్ధికి పూర్తి సహాయ సహకారం అందిస్తున్న ఎమ్మెల్సీ తోటకు జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచ్ కుక్కల నాగమణి, ఎంపీటీసీ సభ్యులు ఉమ్మిడిశెట్టి వీరవేణి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కుక్కల బాలయ్య, పీఏసీఎస్ చైర్మన్ మట్టపర్తి పాల్‌రాజు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ తోట ఇంటింటికీ వెళ్లారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి అర్హుల ఇంటికీ ప్రభుత్వ లబ్ధి అందించాలని, ఇందులో ఎలాంటి సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ భరోసా ఇచ్చారు. దేశంలో మరే రాష్ట్రంలోనూ లేనన్ని సంక్షేమ పథకాలు ఏపీలో అమలు అవుతున్నాయన్నారు. అయినా విపక్ష నేతలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని, వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ఎమ్మెల్సీ తోట తనయుడు తోట పృథ్వీరాజ్, వైఎస్సార్ సీపీ నాయకులు చీకట్ల సుబ్బారావు, గొల్లపల్లి దేవానందం, పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, పుట్టా అబ్బు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు నేడు ఇంటర్వ్యూలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని అన్నాయిపేట, నెలపర్తిపాడు, నరసాపురపుపేట, చోడవరం గ్రామ సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల భర్తీకి శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉదయం 10.30 గంటల నుంచి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ ఎస్.షెలత్‌రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన కోరారు. దీనిని గమనించాలని అన్నారు.

ప్రైవేటు స్కూళ్ల దోపిడీని అరికట్టాలి

కె.గంగవరం: కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని పీడీఎస్‌యూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు బి.సిద్ధూ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద విద్యార్థులతో కలసి ఆయన గురువారం నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ వైద్యనాథశర్మకు వినతిపత్రం అందించారు. ప్రైవేటు పాఠశాలల్లో ట్యూషన్ ఫీజ్, బస్సు ఫీజు, పుస్తకాల ఫీజు, యూనిఫాం ఫీజులంటూ నిలువు దోపిడీ చేస్తున్నారని అన్నారు. ఫీజుల నియంత్రణకు తెచ్చిన చట్టం వెంటనే అమలయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు.

ప్రజా భాగస్వామ్యంతోనే మెరుగైన పారిశుధ్యం

చైర్‌పర్సన్ దుర్గారాణి



ప్రజలతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: ప్రజా భాగస్వామ్యంతోనే మెరుగైన పారిశుధ్య నిర్వహణ సాధ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. గురువారం స్థానిక 7వ వార్డు ఇన్‌చార్జి మందపల్లి రుద్రకాంత్‌తో కలసి అంబేడ్కర్‌నగర్‌లో ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ, డ్రైన్ల శుభ్రం చేయడం గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలపై అక్కడికక్కడే మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్యలతో మాట్లాడి పరిష్కరించే ప్రయత్నం చేశారు. వర్షాకాలం మొదలైన నేపథ్యంలో వార్డుల్లో ఎక్కడా అపరిశుభ్రత లేకుండా ప్రజలు సహకరించాలని కోరారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా పారిశుధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. డ్రైన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయడంతో పూడుకుపోయి మురుగునీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతుందని, ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని చైర్‌పర్సన్ విజ్ఞప్తి చేశారు. షేక్, జంగమ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఆలీఖాన్‌బాబా, మీగడ శ్రీనివాస్, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, కౌన్సిలర్లు మందపల్లి రవికుమార్, పిల్లి శ్రీనివాస్, మారిశెట్టి సత్యనారాయణ, పట్టణ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు పంపన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చప్పిడివారి సావరంలో నేడు జగనన్న సురక్ష



శ్రీకాంత్‌రెడ్డి, కమిషనర్

రామచంద్రపురం: చప్పిడివారి సావరంలోని సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి గురువారం తెలిపారు. దీనిని సచివాలయ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం ద్వారా మున్సిపాలిటీ పరిధిలోని ఆరు సచివాలయాల పరిధిలో ఇప్పటి వరకూ 5,800 వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందించామని తెలిపారు.

కలుపు నివారించండిలా..



కాజులూరులో వెదజల్లిన వరి పొలంలో కలుపు నివారణ మందు పిచికారీ చేస్తున్న రైతులు

- వెదజల్లిన పొలాల్లో కలుపు ఉధృతి
- నివారణకు వ్యవసాయాధికారుల సూచనలు

కాజులూరు: రామచంద్రపురం నియోజకవర్గంలో ఈ ఖరీఫ్‌లో అధిక శాతం రైతులు వెదజల్లిక విధానం చేపడుతున్నారు. నియోజకవర్గంలో 56 వేల ఎకరాల సాగుభూమి ఉండగా ప్రస్తుతం నాట్లు, వెదజల్లిక ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. కాజులూరు మండలంలో 19,500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టగా, ఇందులో సుమారు 85 శాతం పొలాల్లో వెదజల్లిక విధానాన్నే అవలంబిస్తున్నారు. కె.గంగవరం మండలంలో 50 శాతం, రామచంద్రపురంలో 60 శాతం రైతులు ఈ విధానంలోనే సాగు చేపట్టారు. సాధారణ పద్ధతిలో రైతులు దుక్కు దున్ని, పొలాన్ని చదును చేసి నాట్లు వేస్తారు. ఈ విధానంలో కలుపు తీవ్రత తక్కువగా ఉంటుంది. అయితే వెదజల్లిన పొలాల్లో వరితో పాటు కలుపు మొక్కలు సమాంతరంగా పెరుగుతున్నాయి. ఇవి ఎరువులను, భూమిలోని పోషకాలను ఉపయోగించుకుని క్రమేపీ వరి మొక్కలను అధిగమించి పెరిగిపోతాయి. దీంతో పంటకు నష్టం వాటిల్లుతుంది. వెదజల్లిన పొలాల్లో కలుపు తీవ్రత ఊహించిన దానికంటే ఎక్కువగానే ఉందని రైతులు చెబుతున్నారు. కొన్ని రకాల కలుపు మొక్కలను నివారించడం కష్టతరంగా ఉందంటున్నారు. ఈ నేపథ్యంలో వెదజల్లిన పొలాల్లో కలుపు నివారణకు నిర్ణీత మోతాదులో రసాయన మందులు సకాలంలో వాడాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ చెప్పారు. ఆయన సూచనలివీ..

ఇలా చేస్తే మేలు

- వెదజల్లిన పొలాల్లో వరి మొక్క మొలవక ముందే కలుపు నివారించుకోవడం సులభతరం.
- విత్తనాలు జల్లిన మూడు రోజుల్లోపు పొలంలో నీరు తీసేయాలి. ఎకరాకు సాతి 120 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- అలాగే దుంపజాతి కలుపు నివారణకు లోంబాక్స్ పవర్ మందును ఎకరానికి 4 కేజీల చొప్పున విత్తనాలు జల్లిన మూడు రోజుల్లోపు జల్లితే దుంపతో సహా నిర్మూలన జరుగుతుంది.
- మూడు నుంచి ఐదు రోజుల మధ్య స్టాప్‌స్టార్ 35 గ్రాముల మందును అరలీటరు నీటిలో 20 కేజీల గోదావరి ఇసుకతో కలిపి ఎకరం పంటపై బురద పదునుపై జల్లుకోవాలి.
- 15 నుంచి 20 రోజులకు కలుపు ఇంకా ఉన్నట్టయితే నామినీ గోల్డ్ 100 మిల్లీలీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- 15 రోజుల తర్వాత పొలంలో వుడా, జోడల గడ్డి వంటి వెడల్పాటి ఆకులు కలిగిన కలుపు మొక్కలు కనిపిస్తే 2.4–డి సోడియం సాల్ట్ 500 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పొలంలో పిచికారీ చేయాలి.
- కలుపు మందులు పిచికారీ చేసేటప్పుడు పొలంలో పలుచటి నీటి పొర మాత్రమే ఉండాలి. నీరుంటే మొక్కలు చనిపోతాయి.
- వెదజల్లిన పొలాల్లో కలుపును సమర్థంగా నివారించి తెగుళ్లను అధిగమిస్తే నాట్లు వేసిన పొలం కంటే ఎకరాకు 5 నుంచి 10 బస్తాలు అధికంగా దిగుబడి సాధించవచ్చు.

వలంటీర్ల వందనం

ఆపదలో అభయమిచ్చి..



2020 ఆగస్టులో లంక వాసులకు తాగునీరు తీసుకు వెళ్తున్న వలంటీర్ కాశిన రమేష్ (ఫైల్)

లంక గ్రామాల్లో వరదల సమయంలో చుట్టూ నీటితో భయం భయం. కాలు బయట పెట్టాలంటే సాహసం. చిమ్మ చీకటిలో విష సర్పాలతో ఆందోళనకరం. వరదలొచ్చిన ప్రతిసారి ఇదే జీవనం. ఉన్నట్టుండి వచ్చిన ఆపద కారణంగా ఊరిలోకెళ్లి సరుకులు తెచ్చుకునే అవకాశం ఉండదు. ఏటా జూన్, జూలై, ఆగస్టులలో వచ్చే వరదలకు కపిలేశ్వరపురం మండలం కేదారిలంక వీధివారిలంక, నారాయణలంక, అద్దంకివారిలంక, పల్లపులంక ప్రజలు సతమతమవుతుంటారు. ఏళ్ల తరబడి ఇవే అవస్థలతో జీవిస్తున్న ఈ లంక గ్రామాల ప్రజలకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థ ప్రయోజనకరంగా మారింది. లంక ప్రజలకు వలంటీర్లు మేమున్నామంటూ సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఐదు నుంచి వారం రోజుల పాటు వరద నీటి ప్రభావంతో గ్రామస్తులు అల్లాడుతుంటారు. అలాంటి సమయంలో ప్రభుత్వం సమకూర్చిన తాగునీరు, ఆహార పదార్థాలు అందించి వలంటీర్లు ఇతోధిక సేవలు అందిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు.

–కపిలేశ్వరపురం

ఎంతో మేలు జరిగింది



తరచూ గోదావరి వరదకు కేదారిలంక గ్రామం ముంపు బారిన పడుతోంది. ఊరంతా నీటితో మునిగిపోతుంది. ఇదే పరిస్థితి ఏటా ఉంటోంది. 2020, గతేడాది వరదల సమయంలో వలంటీర్లు అందించిన సాయాన్ని మర్చిపోలేను. ఇంట్లో చిక్కుకుపోయిన మాకు ప్రభుత్వ అధికారులు ద్వారా తాగునీరు ఆహార పదార్థాలు సమకూర్చారు. వాటిని మా ఇంటికి వలంటీర్లు తెచ్చి ఇచ్చారు. ఆ సాయం అందకపోతే మేము తీవ్ర అవస్థలకు గురయ్యేవాళ్లం. వలంటీర్ వ్యవస్థ వల్ల లంక గ్రామాలకు ఎంతగానో మేలు జరుగుతుంది.

–దాకే సత్తిరాజు, వీధివారిలంక, కేదారిలంక

అండగా నిలిచి.. సాయం చేసి..



ఏడిదలో కోవిడ్ బాధితురాలికి నిత్యావసరాలు అందజేస్తున్న వలంటీర్ నవీన్ (ఫైల్)

కోవిడ్ సమయంలో సొంత వారే దగ్గరకు వచ్చేందుకు సాహసించేవారుకాదు. అలాంటి సమయంలో తన పరిధిలోని బాధిత కుటుంబాలకు వలంటీర్ పాలేటి నవీన్ అండగా నిలిచాడు. మండపేట మండలం ఏడిద 12వ వార్డు మసీదు ప్రాంతంలో వలంటీర్‌గా నవీన్ సేవలందిస్తున్నాడు. అప్పట్లో 15 కుటుంబాల వారు కోవిడ్ మహమ్మారి బారిన పడగా, వారికి టెస్టులు చేయించడంతో పాటు హోం క్వారంటైన్‌లో ఉన్నప్పుడు ఇళ్లకు వెళ్లి నిత్యావసర సరకులు, మందులు అందజేసేవాడు. కాలికి తీవ్ర గాయంతో రాజానగరం జీఎస్ఎల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పైడిమళ్ల ఎస్సాయ్యకు ఆస్పత్రికి వెళ్లి పింఛన్ సాయం చేశాడు. నడుం నొప్పితో లేవలేని స్థితిలో కొండగుంటూరులోని బంధువుల ఇంటి వద్ద ఉన్న మహిళకు అక్కడకు వెళ్లి ప్రభుత్వ పింఛన్ సాయం అందించాడు.

–మండపేట

సేవలకు 'జోహారిక'



రోడ్డు ప్రమాదంలో నా వెన్నెముకకు తీవ్ర గాయమైంది. మా వలంటీర్ జోహారిక కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి దగ్గరుండి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో అన్ని పరీక్షలు చేయించి నాకు ఆపరేషన్ చేయించారు. తిరిగి నేను పనికి వెళ్లే వరకూ ప్రభుత్వ పరంగా సాయం అందించారు. వలంటీర్ లేకపోతే నేను చాలా ఇబ్బంది పడేదాన్ని.

–పాదూరి శాంతి, మండపేట

'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ మేలు

కపిలేశ్వరపురం: జగనన్న సురక్ష కార్యక్రమంతో పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. వాకతిప్ప సచివాలయ పరిధిలో గురువారం సర్పంచ్ కొరిపెల్ల వెంకట నాగ ప్రవంతి అధ్యక్షతన జగనన్న సురక్ష గ్రామసభ నిర్వహించారు. జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, కార్యదర్శి శివచక్రవర్తి, సచివాలయ ఉద్యోగులు గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో పేదలందరికీ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సాయం అందుతుందన్నారు. 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలను రాజకీయ కోణంలో అమలు చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల ద్వారా పారదర్శకంగా పథకాలు అందుతున్నారన్నారు. అనంతరం పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ మేడిశెట్టి గోవింద్, వైఎస్సార్ సీపీ నాయకులు కొరిపెల్ల ఆనందరావు, బుద్దుడు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



వాకతిప్పలో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

పథకాలు చేరువ చేసేందుకే..

రాయవరం: పేదలకు ప్రభుత్వ పథకాలను చేరువ చేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకు వచ్చారని వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ అన్నారు. చెల్లూరు, రాయవరం సచివాలయాల పరిధిలో గురువారం జగనన్న సురక్ష సభలను ఆయా గ్రామాల సర్పంచులు పాలిక రాఘవ, చంద్రమళ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా గ్రామసభల్లో వైఎస్సార్ సీపీ యువనేత పృథ్వీరాజ్‌తో పాటు మండపేట ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ మాట్లాడుతూ అర్హులను గుర్తించి ప్రభుత్వ పథకాలు అందించడంతో పాటు సచివాలయాల పరిధిలో 11 రకాల సేవలను ప్రజలకు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. జగనన్నను మరోసారి సీఎం చేసేందుకు ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. అనంతరం అర్హులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఉప సర్పంచులు బుద్దాల రాంబాబు, బొడ్డు శ్రీను, ఎంపీటీసీలు వైట్ల వీరవేణి, గంటి రోజా, రాయవరం గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తేతల సుబ్బరామారెడ్డి, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ చిక్కాల శ్రీరాములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నులుకుర్తి సత్యనారాయణ, ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.



చెల్లూరులో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు ఇస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు పృథ్వీరాజ్

ట్రిపుల్ ఐటీల్లో మెరిసిన విద్యార్థులు



సంజయ్‌రామ్



భాగ్యశ్రీ



వంగా బాంధవి రమ



శలా గీతికారత్నం



యర్రా దివ్యతేజశ్రీ



బొల్లంరెడ్డి సాయితేజ

రామచంద్రపురం రూరల్: పదో తరగతిలో మండల స్థాయిలో మొదటి, రెండు స్థానాలూ పొందిన హసన్‌బాద జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పులిదిండి సుభాష్ సంజయ్‌రామ్, వలివేటి భాగ్యశ్రీ ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో మెరిశారు. వీరిలో సంజయ్‌రామ్ 10వ తరగతిలో 572 మార్కులు సాధించాడు. అతడి తల్లిదండ్రులు అదే పాఠశాలలో ఆయాగా, నైట్ వాచ్‌మన్‌గా పని చేస్తున్నారు. తమ కుమారుడు ట్రిపుల్ ఐటీకి ఎంపికవడంపై వారు సంతోషం వ్యక్తం చేశారు. మరో విద్యార్థిని భాగ్యశ్రీ పదో తరగతిలో 563 మార్కులు సాధించింది. ఆమె తండ్రి సూర్య సుబ్రహ్మణ్యం పంచాయతీ కార్యదర్శిగా, తల్లి స్వాతి స్టేట్‌బ్యాంక్ బిజినెస్ కరస్పాండెంట్‌గా పని చేస్తున్నారు. భాగ్యశ్రీ సోదరి దివ్యశ్రీ కూడా గతంలో ఇదే పాఠశాలలో చదువుకుని నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన ఇద్దరు ఇద్దరు విద్యార్థులను ప్రధానోపాధ్యాయిని పీఎస్‌బీఎస్‌కే సుందరి అభినందించారు.

కపిలేశ్వరం మండలంలో..

కపిలేశ్వరపురం: మండలంలోని పలు ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన వంగా బాంధవి రమ (574), శలా గీతికారత్నం (572), యర్రా దివ్యతేజశ్రీ (569) ఎంపికయ్యారు. దివ్యతేజశ్రీ ఒంగోలు కళాశాలకు ఎంపిక కాగా మిగిలిన ఇద్దరూ నూజివీడు కళాశాలలో స్థానం సంపాదించారు. వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి 573 మార్కులు సాధించిన బొల్లంరెడ్డి సాయితేజ నూజివీడు కళాశాలకు ఎంపికయ్యారు. ఆయా విద్యార్థులను పాఠశాలల హెచ్ఎంలు అంగర రాజు, ఎస్‌డీవీ లక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

పేదల సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

పి.గన్నవరం: పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పని చేస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండలంలోని నాగుల్లంక గ్రామంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సొసైటీ కమిటీ చైర్మన్ భీమాల సూరిబాబు, పార్టీ నాయకులతో కలసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. అందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయో లేదో ఆరా తీశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేసి, వీటి వలన కలిగిన లబ్ధిని కుటుంబాల వారీగా వివరించారు.

ఘనంగా గడప గడపకూ 250 రోజుల వేడుక

నియోజకవర్గంలో ఈ కార్యక్రమం ప్రారంభించి 250 రోజులైన సందర్భంగా నాగుల్లంకలో ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

17న చలో విజయవాడ

కాజులూరు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 17న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సహకార సంఘాల ఉద్యోగుల యూనియర్ రాష్ట్ర కోశాధికారి పి.సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమం కరపత్రాలను, వాల్‌పోస్టర్లను గొల్లపాలెం సహకార సంఘ కార్యాలయం వద్ద యూనియన్ నాయకులు గురువారం ఆవిష్కరించారు. సంఘ నాయకుడు జి.అప్పలరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సత్యనారాయణ మాట్లాడుతూ, జీఓ నంబర్ 36 విడుదలై నాలుగేళ్లు పూర్తవుతున్నా ఆప్కాబ్, డీసీసీబీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అమలుకు నోచుకోవడం లేదని అన్నారు. చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చే యాలని కోరారు. వివిధ పీఏసీఎస్‌ల సీఈఓలు పాల్గొన్నారు.

పశుగ్రాసంలో అనేక పోషకాలు

కె.గంగవరం: పాడి పశువులకు కావాల్సిన అనేక పోషకాలు పశుగ్రాసంలో ఉంటాయని దంగేరు గ్రామ పశు వైద్యాధికారి కేవీ రామరాజు అన్నారు. పశుగ్రాస వారోత్సవాల సందర్భంగా పశుగ్రాసం ప్రాముఖ్యత, సాగు, నిల్వ పద్ధతులపై పశుపోషకులకు గ్రామంలో గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. పశుగ్రాసం పెంచుకోవడానికి ప్రభుత్వం సహాయం అందిస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మేలు రకం పశుగ్రాసం పెట్టడం వల్ల పశువులకు మంచి ఆరోగ్యంతో పాటు పాల దిగుబడి కూడా పెరుగుతుందని చెప్పారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

మండపేట: ఏడిద గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనులపై గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద సోషల్ ఆడిట్ నిర్వహించారు. సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు హాజరయ్యారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.72.28 లక్షల నిధులకు సంబంధించి 248 పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈఓ వుండమట్ల వీర్రాజు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, ఎస్ఆర్‌పీ సీహెచ్ఎస్ సత్యనారాయణ, డీఆర్పీ బి.ధనుంజయ్ పాల్గొన్నారు.